జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః

# జయంతి

త్రైమాసిక సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక పత్రిక



బోయి భీమన్న (1911-2005)

సంపుటి 3 సంచిక 2 &3 జనవరి - జూన్ 2006

త్రైమాసిక సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక పత్రిక

# జయంతి

సంపుటి 3 - సంచిక 2 & 3

**జనవరి - జూన్ 2006**

**సంపాదక సలహా మండలి**

**శ్రీ పొత్తూరి వెంకటేశ్వర రావు** (అధ్యక్షులు)

సభ్యులు :

**ఆచార్య ఐ.వి. చలపతిరావు**

**ఆచార్య జె. రాఘవేంద్రరావు**

**డా. పి. సుధాకర్ రావు**

**శ్రీ సి.హెచ్. రాజేశ్వర రావు**

**డా. జి. లక్ష్మణరావు**

**శ్రీమతి సుజాత గోపాల్**

ముఖ్యసంపాదకుడు

**శ్రీ జువ్వాడి గౌతమరావు**

సంపాదకుడు

**డా. కొండలరావు వెల్చాల**

సంయుక్త సంపాదకులు

**ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య**

**ఆచార్య ఎస్వీ రామారావు**

సహ సంపాదకుడు

**శ్రీ టి. సుధాకర రావు**

**జయంతి**

విడి సంచిక వెల రూ. 50/- $5

ప్రత్యేక సంచిక వెల రూ. 100/- $10

విశాలాంధ్ర బుక్ హౌస్‌తో సహా అన్ని ముఖ్యమైన బుక్ హౌస్‌లలో లభించును

ప్రచురణ

**విశ్వనాథ సాహిత్యపీఠం**

**సిస్టర్ నివేదిత ఫౌండేషన్**

11-4-654/3, రెడ్‌హిల్స్,

లక్డీకాపూల్, హైదరాబాదు - 500 004

ఫోన్ : 23396358, 23305134

ముద్రణ :

**PARTHASARATHI PRINTERS**

Nallakunta, Hyderabad.

Phone : 55108206 / 9246508206

**సంపాదకీయం :**

# విద్య - విలువలు

విద్య ఎందుకని మనమీరోజుల్లో ప్రశ్న వేసికొంటే మనకు మామూలుగా వచ్చే జవాబు, డాక్టర్ కావడానికి, ఇంజనీయర్ కావడానికి, ఐ.ఎ.ఎస్. అధికారి కావడానికి, మంచి వ్యాపార వేత్త కావడానికి, బయటి దేశాలకు వెళ్ళి బాగా సంపాదించడానికి, పెద్ద ఉద్యోగాలు చేయడానికి, పెద్ద పెద్ద పదవులు అలంకరించడానికని జవాబు వస్తుంది.

కొత్త కొత్త విషయాలు కనుగొనడానికి, కొత్తవి సృష్టించడానికి, కొత్త పరిశోధనలు చేబట్టడానికి, నిర్మాణాలు చేయడానికి, కొత్త పద్ధతులు, విధానాలు, సంస్కృతులు ప్రవేశపెట్టడానికి, పాతవాటిని సంస్కరించడానికి, లోకకళ్యాణానికి పాటుపడడానికి, మానవీయ విలువలు పరిరక్షించడానికి అనే జవాబు చాలా అరుదుగా వస్తుంది.

మొదటి జవాబులో రెండవ జవాబు లేదా యని కొందరనవచ్చు. ఉంది. లేదు. లేదనడానికే ఆస్కారమెక్కువేర్పడుతోంది.

వ్యక్తి ఎంతైనా సంపాదించవచ్చు, ఎంత పెద్ద పదవైనా అలంకరించవచ్చు, ఎంత పెద్ద చదువైనా చదవవచ్చు, ఎన్ని ఎన్నికల్లోనైనా గెలవొచ్చు, ఎన్ని దేశాలైనా తిరగొచ్చు, కాని సమాజానికి దాని వలన ఏమీ ఒరగకపోవచ్చు. పైపెచ్చు దాని వలన సమాజమే దాని శ్రేయస్సు నెంతో కోల్పోవచ్చు. సమాజం వలననే వ్యక్తి ఎంతో పెరిగి సమాజాన్నే మరచిపోయి, దాని దోపిడికి ముందడగు వేయవచ్చు, సమాజానికి అతని వలన లాభం కన్నా నష్టమే ఎక్కువ వాటిల్లవచ్చు. చరిత్రలో మనకు అలాంటివారి ఉదాహరణలే ఎక్కువ లభిస్తాయి, వారికి బ్రతకడమే ప్రధాన లక్ష్యం, జీవించడం కాదు. బ్రతకడమంటే ఏ సామాజిక దృష్టి, సమగ్ర దృష్టి, విశ్వమానవ కళ్యాణ దృష్టి లేకుండా కేవలం వారికొరకే వారి సుఖసంతోషాల కొరకే బ్రతకడం. వీరిలో చాలా మంది “విద్యావంతులే” విద్య యొక్క మామూలు అర్థంలో. వీరికి విద్యంటే కేవలం సాంకేతికం. మానవీయం కాదు. వీరి విద్యంతా కౌశల్యాలకు, నైపుణ్యతలకు, ప్రావీణ్యతలకు, అనగా స్కిల్స్‌కు చెందిందే కాని విలువలకు, వ్యాల్యూస్‌కు చెందింది కాదు. వీరికి ‘మనీ’ కొరకే ‘పని’ కాని పనితనం కొరకు పని కాదు. వీరికి పనంతా పెద్ద పెద్ద పదవులలంకరించుటకు, పెద్ద పెద్ద రాబళ్ళు రాబట్టుకొనుటకొరకే కాని సమాజ సంక్షేమం కొరకు కాదు. వారి దృష్టి దృక్పథమంతా సామాజికం కన్నా ఎక్కువ రాజకీయం, వ్యాపారం, స్వార్థం. వారిది స్వప్రయోజన దృష్టే కాని సదరు ప్రయోజన దృష్టి కాదు.

ఈనాటి విద్యంతా ఇలా పరిణమిస్తోంది. అది వలువలకు చెందిందే కాని విలువలకు చెందింది కాకుండా పోతోంది. అందుకే ఎన్ని వసతులు, వనరులు, సౌకర్యాలు, సేవా పదార్థాలు మనకు చేకూరినా, అంతటా అదేదో అశాంతి, అభద్రత, అవినీతితో కూడుకొనిన అయోమయం, ఒకరిపై ఒకరికి అపనమ్మకం కళ్ళకు కొట్టొచ్చినట్లు కనబడుతుంది. అంతటా సౌశీల్యం, సౌహార్ద్రం, సమతా భావం, మమతా భావం కొరవడినట్లు, అంతటా అదేదో అంగట్లో నివసిస్తున్నట్లు, బాంధవ్యం బాంధవ్యం కాకుండా, స్నేహం స్నేహం

కాకుండా, విశ్వాసం విశ్వాసం కాకుండా పోతోన్నట్లనిపిస్తోంది. దూరాలు దగ్గరవుతున్నాయి కాని దూరస్థులు దగ్గర కావడం లేదు. ప్రతి వారికీ మన సమాజంలో అవినీతి, అత్యాశ, అధర్మం పెరిగిపోతోందని, వస్తువులే కాక మనుషులు కూడా అమ్ముడుపోతున్నారని, మనిషి తన మానవత్వాన్ని కోల్పోతున్నాడని, శాంతి, ప్రశాంతి, రక్షణ త్వరితగతిగా తగ్గుతోందని, దీనికంతకీ కారణం విలువలు కోల్పోవడమేనని కూడా తెలుస్తోంది కాని, అందరూ అయ్యో ! ఇదేమిటి అంతా ఇలా జరుగుతోందేమిటని అంగలార్చేవారే, గొంతుచించుకొని అరచే వారే కాని ఎవరికివారు దిగజారిపోతోన్న విలువల గురించి సీరియస్‌గా ఆలోచించేవారు కానీ పట్టించుకొనేవారు గానీ అగపడరు. ఎవరికి వారు ఎలాగో ఒకలాగు వారి అవసరాలు తీర్చుకొని బయటపడేవారు. ఎవరికివారు, వారు మంచివారే కాని ఇతరులే అంతా చెడ్డవారని అభాండాలు వేసేవారే.

మన చదువంతా చెడిపోతోంది. విద్యంతా కేవలం సాంకేతికంగా మారుతోంది. మనిషిని 'మనిషి' ని చేయడానికి కాదు, 'పని మనిషి' ని చేయడానికి రూపొందించబడుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులంతా వారి పిల్లలకు పరీక్షల్లో బాగా మార్కులు వస్తున్నాయా లేవా , వారు ఇంగ్లీషు బాగా మాట్లాడగల్గుతున్నారా లేదా, అమ్మను అమ్మ అని, నాన్నను నాన్న అని అనకుండా 'మమ్మీ', 'డాడీ' యని సునాయసంగా పిలువగల్గుతున్నారా లేదా యని, వారు ఏ డాక్టరో, ఇంజనీయరో, మరేదొ కాగల్గుతారా లేదా యని ఆరాటపడేవారూ ఆందోళన చెందే వారే కాని, వారి పిల్లలు మున్ముందు మంచి మనుషులుగా, మంచి పౌరులుగా, మానవీయ విలువలున్నవారుగా రూపొందుతున్నారా లేదా యని పట్టించుకొనేవారు లేరు. వారి వలెనే వారి పిల్లలు చదివే విద్యాలయాలు, పాఠాలు చెప్పే అధ్యాపకులు కూడా. ఇప్పటి విద్యార్థులకు, ఈనాటి మిషనరీకి (machinery) ఎలాంటి తేడా లేకుండా పోతోంది. మిషన్లు ఎలా పని చేస్తాయో అలాగే మన విద్యార్థులు కూడా పని చేయాలని మన విద్యాలయాలు కృషి చేస్తున్నాయి. మిషన్లకు స్కిల్స్ ఉంటాయి, శక్తి సామర్థ్యాలు ఉంటాయి కాని వేదన, సంవేదనలు, అనుభూతులు మున్నగునవి ఉండవు. అలాగే మిషన్లు ఎలాగైతే ethics - nutral, morals - neutral, values - neutral గా ఉంటాయో ఈనాటి విద్యార్థులు విద్యావంతులు కూడా. వారికి రీతితోనే పని కాని నీతితో లేకుండా పోతోంది. ఇలాంటి సమాజంలో అవినీతులు, దోపిడీలు, దొంగతనాలు, అన్యాయాలు, అరాజకాలు, కక్షలు, కల్మషాలు, పోట్లాటాలు, హింసలు, హత్యలు, యుద్ధాలు తప్పవు. తద్వారా అశాంతి తప్పదు, అభద్రత తప్పదు, సామాజిక సంక్షోభం తప్పదు.

మనం మన విద్యను పెడత్రోవపట్టించి దాని పర్యవసానంగా ఉత్పన్నమవుతోన్న సమస్యలన్నింటినీ పోలీసుల ద్వారా, మిలిటరీ ద్వారా, కర్ర పెత్తనం ద్వారా అరికట్టాలనుకొంటున్నాం. అదెలా సాధ్యం? అది కొంత మంది మాత్రమే అవినీతికి, అరాజకానికి పాల్పడితే సాధ్యమవుతుంది కాని నూటికి తొంభై శాతం అవినీతికి, అరాజకానికి, విధ్వంసానికి, హింసకు, దోపిడీకి పాల్పడితే ఎలా సాధ్యమవుతుంది? పైపెచ్చు మన ప్రజాస్వామ్యంలో కులాల, మతాల, ప్రాంతాల, పార్టీల, భాషలకు చెందిన వారి ఒత్తిళ్ళు, ప్రభుత్వ యంత్రాంగాన్ని పనిచేయకుండా అడ్డుకునే అవకాశాలు చాలా ఎక్కువ. నేరస్థున్ని నేరస్థునిగా చూడకుండా, శిక్షించకుండా, కులాల పేరట, మతాల పేరట, ప్రాంతాల పేరట, పార్టీల పేరిట చూచి వదిలేయాలని ఒత్తిళ్ళు తెచ్చే రాజకీయ సంస్కృతి ఎక్కువ.

దీనికంతకీ పరిష్కారం విద్యద్వారా చేబట్టాలి కాని ఇతరత్రా కాదు. విద్య ఒకటి బాగుంటే అన్నీ బాగుంటాయని గ్రహించాలి. విద్యల్లో, అన్ని స్థాయిల్లో పాఠ్యాంశాలలో, పుస్తకాలల్లో, బోధనల్లో విషయాలను విలువలతో పాటు బోధించాలి కాని కేవలం విషయాలుగా కాదు. అలాగే విలువలను విషయాలతో పాటు బోధించాలి కాని విడిగా, అదనంగా కాదు. ఇలాంటి విద్య మన గురుకుల విద్యాలయాలలో, మన నాగార్జున, నలందా విశ్వవిద్యాలయాలలో మనకు ఒకప్పుడుండెడిది. ఇప్పటికీ మన సరస్వతీ విద్యా మందిర్ల లాంటి కొన్ని సంస్థల్లో ఎంతో కొంత ఇలాంటి విద్య మిగిలి ఉంది, కాని చాలా వాటిల్లో లేదనే చెప్పాలి. అలాంటి విద్య లోపించడం వలననే మనం మన భారతీయతా గౌరవాన్ని గుర్తింపును పోగొట్టుకున్నాం, ఇంకా పోగొట్టుకొంటూనే ఉన్నాం. ఇప్పుడు మన విద్యల్లో జరుగుతున్నది మాత్రం విషయాలను  కేవలం విషయాలుగా బోధించ ప్రయత్నించడం, విలువలను కేవలం విలువలుగా విడిగా బోధించ ప్రయత్నించడం. ఇవి రెండు కూడా విఫలానికి దారులే. ఎంత వరకైతే మన విద్యల్లో మానవీయ విలువలు కేంద్ర బిందువులు కావో, అవి అలా బోధించబడవో, పాఠ్యాంశాలలో చేర్చబడవో,  పుస్తకాలలో వ్రాయబడవో అంత వరకు మన విద్య విద్య కాకుండా పోతుంది. తద్వారా మన ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం కాకుండా పోతుంది.

మాజీ ప్రధాని కీ.శే. పి.వి. నరసింహారావు ఒకసారి ఒక ఉపన్యాసంలో "అందరూ విద్యావంతులే కాని వారికే తెలియాలి వారిలో విద్యెన్ని వంతులో" యని చమత్కరించారు. మరొకసారి "మన పూర్వీకులు విద్యను అనంతం విద్య యని యనుకొన్నారు కాని ముప్పది శాతం, నలభై శాతం, యాభై శాతం, అరవై శాతం యని ఈనాటి విద్యాలయాలు, విద్యార్థులు, విద్యాధికులు అనుకొంటూన్నట్లు అనుకోలేదు" యని యన్నారు.  అలాగే కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు "ఈనాటి చదువులు చదువులే కాని విద్యలు కావు" యని యన్నారు, చదువంటే వివేకమను అర్థంలో. వీటిని నిజమే యని యనేవారే కాని వీటిని సరిదిద్దుదామని పట్టించుకొనే వారేరీ ఈ రోజుల్లో ?

విద్యకు భాషకు, భాషకు సాహిత్యానికి, సాహిత్యానికి విలువలకు ఎంతో సన్నిహిత సంబంధముంది. విద్యార్థుల భాష బాగులేకపోతే, వారికి చదవడం, వ్రాయడం, వినడం, అర్థం చేసికోవడం కష్టమవుతుంది. భాష బాగా రావాలంటే సాహిత్యం ఎంతో కొంత పఠించక తప్పదు.  ఎందుకంటే సాహిత్యంలోనే కదా మెరుగైన, మెరువైన భాష విస్తారంగా దొరికేది.  అలాగే విద్యల్లో విలువలుండాలంటే సాహిత్య పఠనం తప్పనిది యని యనకతప్పదు.  ఎందుకంటే సాహిత్యమంతా హితమే కదా మరి? మంచి సన్నివేశాలను, మంచి పాత్రలను సృష్టించి, మంచి ఘటనా సంఘటనలను ప్రవేశపెట్టి మనుషుల్లో 'మంచి' ని 'ప్రేమను' 'సౌహార్ద్రతను' 'స్నేహశీలతను' పెంచడమే సాహిత్యం యొక్క లక్ష్యం కనుక. అలాంటప్పుడు మనకు భాషాభ్యున్నతి కావాలన్నా సంఘంలో నీతి పెరగాలన్నా , మనుషుల్లో మానవీయత హెచ్చాలన్నా సాహిత్య పఠనం, అదీ మంచి సాహిత్య పఠనం తప్పనిసరి యని మన విద్యార్థులు, విద్యాలయాలు గ్రహించాలి, గుర్తించాలి.

**- డా. కొండలరావు వెల్చాల**

సంపాదకుడు

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/kbook.php?id=793](http://kinige.com/kbook.php?id=793)

* * *

**Read Jayanthi Magazines @**

[http://kinige.com/kbrowse.php?via=author&id=163](http://kinige.com/kbrowse.php?via=author&id=163)